
# నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 25 జూన్ 2024 | RANGAREDDY


# మళ్లీ కరెంట్ కరువొచ్చింది..!

## అన్నదాతలకు కష్టమొచ్చింది..

### ఎవుసం సాగేనా..



అరకొర కరెంట్‌తో యాసంగి పంటలు ఆగమైనయ్.. వానకాలంలోనూ ఎవుసం సాగడం కష్టమే. కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు సమస్య పరిష్కారాన్ని.. రైతుల బాధను పట్టించుకోవడం లేదు. ఒక్కోసారి గ్రామాల్లో సింగిల్ ఫేస్ కరెంటు రాక రాత్రి అంతా నిద్ర లేక ఇబ్బంది పడుతున్నాం. రైతులు మరో ఉద్యమం చేయడం ఖాయం


– సంపల్లి మల్లేశ్, మోత్కూర్ గ్రామం, దోమ మండలం

### కేసీఆర్ హయాంలో ఎవుసం పండుగే..



కేసీఆర్ హయాంలో ఎవుసం పండుగైంది. 24 గంటలూ కరెంటు ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ కరెంటు కష్టాలు మొదలైనయ్. పరిశ్రమలకూ సరైన విద్యుత్తు అందక పనులు ఆగుతున్నయ్. కరెంట్ కోతలతో మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నయ్. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతల కోసం ఆలోచించి నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలి. పదేండ్లుగా కరెంట్ బాధలు తెల్వలే. రైతన్నల బతుకులు బాగు చేసిన కేసీఆర్‌పై లేని పోని ఆరోపణలు చేయడం సరికాదు.

– శేఖర్ రైతు, పూడూరు గ్రామం, మండలం



ఉమ్మడి పాలనలో ఉన్న అరకొర కరెంట్ సమస్య మళ్లీ వచ్చింది. ఎప్పుడొస్తదో, ఎప్పుడు పోతదో తెల్వని కరెంట్ వల్ల అన్నదాతలు బోరుబావుల కాడ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి మళ్లొచ్చింది. ఇండ్లకు, పరిశ్రమలకు, వ్యవసాయానికి రెండు, మూడు గంటలు ఇచ్చే కరెంట్‌తో జనం గోస తీసిండ్రు. పనులూ నత్తనడకన సాగినయ్. సాగు భూములు నెర్రెలు బారినయ్. రైతన్నలు కండ్ల నుంచి కన్నీటి ధారలు పారినా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించలే. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రాజెక్టుల నిర్మాణాలతో పుష్కలంగా నీళ్లు, నిరంతర కరెంట్‌తో పదేండ్లు ఎవుసం పండుగలా సాగింది. రాత్రిపూట పొలం కాడికి పోయే బాధ తప్పింది. రైతన్నలకు కొండంత అండగా నిలిచి, బతుకులకు భరోసా ఇచ్చిన పెద్ద సారుపై నిందలేయడం సరికాదు. మళ్లీ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చింది.. అన్నదాతలకు కష్టాలు మొదలయ్యాయి. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. యాసంగి కరెంట్ కటకటతో అంతంత మాత్రంగానే పంటలు పండడంతో తీవ్ర ఆందోళనకు గురైనమ్. ఈ వానకాంలోనైనా సరిపడా కరెంట్ ఇస్తే ఎవుసం గట్టెక్కుతదని అన్నదాతలు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. అన్నదాతలను ఆగం చేసే కాంగ్రెస్ పాలన మాకొద్దంటూ తమ అభిప్రాయాలను తెలుపుతున్నారు.

– న్యూస్ నెట్ వర్క్, నమస్తే తెలంగాణ

### చిరు వ్యాపారులకూ ఇబ్బందులే..



విద్యుత్తు సరఫరా లేక వ్యవసాయ దారులతో పాటు, చిరు వ్యాపారులకూ ఇబ్బందులు తప్పడం లేదు. బీఆర్ఎస్ పాలనలో కరెంటు కష్టమంటే తెల్వక పోయేది. కాంగ్రెస్ వచ్చినకాడి నుంచి కథ మొదటికొచ్చింది. ప్రజాపాలన అంటూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఎలా..

– మందిపల్ వెంకట్, మాజీ ఎంపీటీసీ మందిపల్, కులకచర్ల

### కేసీఆర్ హయాంలోనే గృహాలకు 24 గంటల కరెంట్



తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలోనే గృహాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తు సరఫరా జరిగింది. పెట్టుబడి సాయం సకాలంలో అందేది. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రోజుకు కనీసం ఐదారుసార్లు కరెంట్ పోతున్నది. పెట్టుబడి సాయం సమయానికి అందడం లేదు. రైతులు ఏ ఇబ్బందులు పడినా పట్టించుకోకపోతే రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు. కాంగ్రెస్ పాలన కంటే గత బీఆర్ఎస్ పాలనే మంచి గుండే. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుని నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలి.

– కంబాలపల్లి అనిల్, ఆమనగల్లు మున్సిపాలిటీ

### కరెంట్ కష్టాలు మళ్లీ మొదటికి..



కేసీఆర్ పాలనలో నిరంతరం విద్యుత్తు సరఫరా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కాడి నుంచి ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి చినుకులు పడినా కరెంట్ తీసేస్తున్నారు. మళ్లీ ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. కరెంటోళ్లకు ఫోన్ చేస్తే లైన్ ట్రిప్పు అయి కరెంటు పోయిందని చెబుతున్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కరెంటు ఇబ్బందులు ఉండేవి కావు. మళ్లీ కరెంటు కష్టాలు మొదటికి వచ్చాయి.

– దండు సత్యం, చేవెళ్ల గ్రామం

### గతంలోనే కరెంటు మంచిగుండే..



కాంగ్రెస్ పాలన వచ్చాక కరెంట్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. నిరంతరం విద్యుత్తు సరఫరా చేస్తున్నామంటున్న కాంగ్రెస్ నాయకుల మాటల్లో నిజం లేదు. కరెంట్ విషయంలో కేసీఆర్‌ను మరచిపోలేం. కేసీఆర్ హయాంలో 24 గంటలు ఉండేది. విద్యుత్తు సమస్యలు అంటే ఎంటో రైతులకు తెలిసేది కాదు. బోరు, బావి మోటర్లతో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండినయ్. వ్యవసాయం పండుగలా సాగింది. ఇప్పుడు మళ్లీ ఎవుసం దండుగయ్యే కాలమొచ్చింది.

– రాంప్రసాద్, ఊరెళ్ల గ్రామం, చేవెళ్ల మండలం



పట్లూర్ పీహెచ్‌సీలో కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

# విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

**పట్లూర్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్**

**అందుబాటులోని వైద్యుడు.. చర్యలకు కలెక్టర్‌కు ఆదేశం**

మర్పల్లి, జూన్ 24 : ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని, లేదంటే చర్యలు తప్పవని శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలోని గదులు, రికార్డులను పరి శీలించారు. ఇక్కడ ఎంత మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఎంహెచ్‌వోకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో కలెక్టర్‌కు ఫోన్ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట రాష్ట్ర నాయకుడు రాములు యాదవ్, ఎంపీటీసీలు స్వప్నాసురేశ్, మహేశ్, మాజీ సర్పంచ్ సురేశ్‌యాదవ్, సురేశ్‌కుమార్, సాయిపటేల్, నందుప్రకాశ్ పాల్గొన్నారు.

# ఫస్టియర్‌లో 63.86 శాతం..

# సెకండియర్‌లో 43.77 శాతం

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

రంగారెడ్డి, జూన్ 24(నమస్తే తెలంగాణ) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను సోమవారం ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. రంగారెడ్డి జిల్లాలో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలను 2,54,498 మంది రాయగా..1,62,520(63.86 శాతం)మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఫస్టియర్ ఒకేషనల్‌లో 53.24శాతం ఉత్తీర్ణత నమోదైంది. సెకండియర్ పరీక్షలను 1,38,477 మంది విద్యార్థులు రాయగా..60,615(43.77 శాతం)మంది పాస్ అయ్యారు. సెకండియర్ ఒకేషనల్‌లో 51.12శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు.

# మహిళల ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటునందించాలి

వికారాబాద్, జూన్ 24 : ప్రభుత్వం విస్తృతంగా రుణాలు ఇచ్చి మహిళల ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటునందిస్తున్నదని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళా శక్తి కార్యాచరణ ప్రణాళికపై జిల్లా గ్రామీణాభివృద్ధి సిబ్బంది ఏపీఎం, సీసీలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024 –25 సంవత్సరం కింద చేపట్టాల్సిన 14 రకాల పథకాలపై మహిళల్లో అవగాహన కల్పించి లబ్ధిదారుల ఎంపికపై శనివారం లోగా కసరత్తు చేపట్టాలన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా 2024– 25 కు సంబంధించి 9,722 యూనిట్లకు 11,354 లక్షల రూపాయల రుణాలకు గ్రౌండింగ్ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. 14 రకాల పథకాలలో భాగంగా పెరటి కోళ్ల పెంపకం, మండల స్థాయిలో క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, సామూహిక పప్పు ధాన్యాల సేకరణ, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ తదితర యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే మహిళలను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ యాదగిరి, అడిషనల్ డీఆర్డీవో సరోజ, డీపీఎంవో రామమూర్తి, శ్రీనివాస్, వీరయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

# పెండింగ్ బిల్లులను చెల్లించాలి

**కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా**

- ప్రధాన గేటుకు అడ్డంగా కూర్చుని నిరసన.. పెద్ద ఎత్తున నిలిచిపోయిన వాహనాలు
- పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే.. వంట బంద్ పెట్టి సమ్మెకు దిగుతామని ప్రభుత్వానికి హెచ్చరిక

రంగారెడ్డి, జూన్ 24(నమస్తే తెలంగాణ) : మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పెండింగ్ మెనూ చార్జీలను వెంటనే చెల్లించాలంటూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది కార్మికులు తరలివచ్చి ఈ ధర్నాలో పాల్గొన్నారు. కలెక్టర్ వాహనాన్ని అడ్డుకోవాలని కార్మికులంతా ప్రధాన గేటు వద్దకు వచ్చేసరికి అప్పటికే కలెక్టర్ కారు వెళ్లిపోవడంతో గేటు వద్ద అడ్డుగా కూర్చుని నిరసన తెలిపారు. దీంతో కలెక్టర్ కార్యాలయంలోపలికి వచ్చే వాహనాలు, బయటకు వెళ్లే వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయి అరగంట వరకు రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు యెలమోని స్వప్న మాట్లాడుతూ మెనూ చార్జీలతోపాటు కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నెలల తరబడిగా బిల్లులు రాకపోవడంతో ఎదురు పెట్టుబడి పెట్టి విద్యార్థుల కడుపులు నింపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గుడ్ల కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్‌తో వారానికి మూడు గుడ్లు ఎలా పెట్టాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం కార్మికులకు రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో వారం రోజుల తర్వాత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం బంద్ పెట్టి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా నాయకులు డి.కిషన్, పోచమోని కృష్ణ, ఇ.నర్సింహ, బట్టి బాలరాజు, శ్రీను, మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అలివేలు, ఉపాధ్యక్షురాలు గణేశ్, కోశాధికారి సరిత, జిల్లా నాయకులు శిరీష, పద్మ, లక్ష్మమ్మ, లక్ష్మి, భాస్కర్, శ్రీలత, రమాదేవి, మల్లారి నవనీత తదితరులు పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు

# ఊరూరా.. భూసార పరీక్షలు



**ప్రయోగాత్మకంగా రంగారెడ్డి జిల్లాలోని నందిగామ మండలం ఎంపిక**

**ఇప్పటికే పూర్తయిన శిక్షణ..930 నమూనాలు సేకరించాలని లక్ష్యం**

**ప్రతి అంగుళంలో ఉన్న మట్టి స్వభావం తెలిసేలా పరీక్షలు నిర్వహించనున్న వ్యవసాయ అధికారులు**

**భూసార పరీక్షలు నిర్వహించే గ్రామాలు**

| గ్రామం | నమూనాలు |
|---|---|
| చేగూర్ | 276 |
| మామిడిపల్లి | 152 |
| ఏదులపల్లి | 104 |
| నందిగామ | 288 |
| వీర్లపల్లి | 110 |

రంగారెడ్డి, జూన్ 24(నమస్తే తెలంగాణ) : హైబ్రిడ్ విత్తనాలు.. రసాయన ఎరువులు.. పురుగు మందుల వాడకంతో నేలలో సారం తగ్గిపోవడం, పోషకాల సమతుల్యత దెబ్బతినడం వంటివి జరుగుతున్నాయి. ఇవి పంట దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో భూసార సంరక్షణకు భూసార పరీక్షలు ఎంతో అవసరమని ప్రభుత్వం సంకల్పిస్తున్నది. ఇందులో భాగంగా ఊరూరా భూసార పరీక్షల ఆవశ్యకతను గుర్తించి ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాంతాల్లో మట్టి పరీక్షలను చేపట్టేందుకు నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లాలో నందిగామ మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి ఐదు గ్రామాల్లో సమగ్ర భూసార విశ్లేషణకు కార్యాచరణను జిల్లా వ్యవసాయ శాఖ రూపొందించింది. ఇందుకు సంబంధించి సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయింది. మంగళవారం నుంచి ఎంపిక చేసిన గ్రామాల్లో మొత్తం 930 మట్టి నమూనాలను సేకరించనున్నారు.

### కచ్చితమైన ఫలితం తెలిసేలా..

రైతులు తమ భూమిలోని సారాన్ని తెలుసుకుని అందుకు తగ్గట్టుగా పంటలను సాగు చేసేందుకు భూసార పరీక్షలు దోహదపడనున్నాయి. సహజంగా మే నెలలోనే మట్టి నమూనాలను సేకరిస్తారు. ఈసారి కొంత ఆలస్యం కావడంతో ప్రస్తుత వానకాలం సీజన్‌లో అనుకున్న లక్ష్యం మేరకు నమూనాలను సేకరించనున్నారు. గతంలో ప్రతి 25 ఎకరాలకు ఒకటి చొప్పున మట్టి నమూనాలను సేకరించేవారు. అయితే ఈసారి కేవలం రెండున్నర ఎకరాలకు ఒకటి చొప్పున శాంపిల్స్ తీయనున్నారు. దీంతో పంట క్షేత్రాల సంఖ్య తగ్గి ఎక్కువ నమూనాలను సేకరిస్తుండడంతో ప్రతి అంగుళంలో ఉన్న మట్టి గురించి తెలుసుకునే అవకాశం కలుగనున్నది. ఫలితంగా కచ్చితమైన భూసార పరీక్షలు తెలుస్తాయి. ఈ ఫలితాల ఆధారంగా ఏయే పంటలను సాగు చేయాలో! తెలుసుకునే వీలు రైతులకు కలుగుతుంది. తద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గి భూమి సారవంతం కావడంతో పెట్టుబడులు సైతం గణనీయంగా తగ్గి రైతులకు వెసులుబాటు కలుగనున్నది.

### వివరాలు యాప్‌లో నమోదు..

వైవిధ్యమైన పంటల సాగుతో ప్రత్యేకతను చాటుతున్న నందిగామ మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో మట్టి నమూనా సేకరణను పకడ్బందీగా చేపట్టనున్నారు. మట్టి నమూనాలను సేకరించిన తర్వాత వ్యవసాయ విస్తరణ అధికారులు ఎప్పటికప్పుడు వివరాలను సాయిల్ హెల్త్ కార్డు(ఎస్‌హెచ్‌సీ) పోర్టల్ మొబైల్ యాప్‌లో నమోదు చేయనున్నారు. చేగూర్, మామిడిపల్లి, ఏదులపల్లి, నందిగామ గ్రామాల్లో సేకరించిన 600 మట్టి నమూనాలను పరీక్షల కోసం ఇబ్రహీంపట్నంలోని వ్యవసాయ మార్కెట్‌లోని భూసార పరీక్షా కేంద్రానికి పంపనున్నారు. నందిగామ, వీర్లపల్లిలలో సేకరించిన 330 నమూనాలను రాజేంద్రనగర్‌లోని సాయిల్ టెస్ట్ ల్యాబ్‌కు పంపనున్నారు. ఆగస్టు నెలలోపు మట్టి నమూనాల విశ్లేషణ ఫలితాలను రైతులకు అందజేయనున్నారు. ప్రతి క్లస్టర్ పరిధిలో ఒక అభ్యుదయ రైతును ఎంపిక చేసుకుని ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. వచ్చే ఫలితాలను బట్టి అన్ని గ్రామాల్లోనూ విడుతల వారీగా భూసార పరీక్షలను ప్రభుత్వం చేపట్టనున్నది.



### రైతులకు ప్రయోజనం..

భూసార పరీక్షల వల్ల నీటి వాడకంతోపాటు, ఏ మోతాదులో మందులు, ఎరువులు వేయాలో తెలుస్తుంది. తద్వారా పెట్టుబడులు తగ్గడంతోపాటు అన్ని రకాలుగా రైతులకు లబ్ధి చేకూరుతుంది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో మట్టి నమూనాలను సేకరించాక వచ్చిన ఫలితాలకు సంబంధించి రైతులకు నేల ఆరోగ్య కార్డులను అందజేయనున్నాం. దానిలో భూమికి సంబంధించిన సమాచారం పొందుపర్చడం వల్ల పంటల సాగులో రైతులకు ప్రయోజకంగా ఉంటుంది.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి